# పంకజం

ఎన్. ఆర్. చందూర్

౧

'ఏమండీ, యివ్వాళ చాలా విచారంగా వున్నారేం ?'

'ఏముంది, యథాప్రకారం! ముందునుయ్యి, వెనుక గొయ్యి'

'ఏమైనా వచ్చిందేమిటి మళ్ళ ?'

'ప్రాణాన్ని వదులుకోవాలో, ఉద్యోగాన్ని వదులుకోవాలో నాకు గోచర మవడంలేదు'

'ఎస్టేటులెక్కల్లో ఏం తేడాలు రాలేదు కదా ?'

'తేడాలేదు, గీడాలేదు... వెధవ జీవితం .. దుర్భరంగా వుంది'

'......... .........'.. .. ..'

'జమీందారు దగ్గర చాకిరి చెయ్యడం కంటె నీచమైన పని వేరొకటి లేదీ ప్రపంచకంలో'

'ఏమైనా సిస్తుబకాయి విషయాలా ?'

'ఊఁ...అవేన్లే...నన్ను చంపేందుకు......ఆ గూడెంపోయి... రేపు సాయంకాలం లోపున రావలసిన బాకీ అంతా వసూలు చేసుకు రావాలట'

'................ .. ... ....'

'ఆ రైతుల విషయం నీ కింతకి పూర్వం చెప్పాను కాదూ ?'

'ఊఁ... చెప్పారు. ఎంత దురాచారం, స్మృతులూ శాస్త్రాలూ వెలిగిపోయే ఈ దిక్కుమాలిన దేశంలో తగులబడ్తోంది కాని!! అధికారికి యివ్వవలసిన సిస్తుని అడగడానికి వచ్చిన మనిషిని నడివీధిలో కూనీ చేస్తామనే మూర్ఖులు, శుంఠలు ..'

'ఆఁ ఆఁ పంకజం, తొందరపడకు. పంటలు నాశనమైపోగా, తిండానికి కూడులేక మల మల మాడే ఆ రైతుల కడుపుమంట వెల్సూ, బెర్నర్డ్ షా చదివే నీకేం తెలుస్తుంది!'

'అవేం మాటలండీ, అలా అంటూరు. చేతనైతే జమీందారుతో మొరబెట్టుకోవాలి; లేకపోతే నోరు మూసుకోవాలి. అంతేకాని, సిస్తులు పోగుచెయ్యడానికి వచ్చిన గుమాస్తాని చంపుతామని అనడం పశుత్వం కాదూ! అన్నెపున్నెము లెరుగని గుమాస్తాలు వారి మూర్ఖపు ఆవేశానికి ఆహుతి అవాలా ?'

'ఊఁ ..ఏమైతే ఏంలాభం!! ఆ గూడెం వెళ్ళడం యిది అయిదోతఫా. క్రితంమారు వెళ్ళినప్పుడే ఆ ఊరి మునసబు ఖండించి చెప్పాడిక

రావద్దని మళ్లీవస్తే నీ బుర్రరామ కీర్తనలు పాడిస్తాను; ఈ నడివీధిలో' అని వారించాడు. ఏం చెయ్యడానికీ తోచడంలేదు...'

'............ ..............'

'వెళ్తే చావు బతుకులు వారి కరుణాకటాక్షాల్లో వుంటాయి; మానేస్తే ఉద్యోగ నాశనం...'

'...........................'

'ఉద్యోగం లేకపోతే మనం మలమల మాడాలి. మాడి, కృశించి, శల్యావశిష్టమై మరణించాలి'

'ఏమిటండీ, యింతచిన్న విషయానికే అంత బెంబేలు పడిపోతారు. గొప్పచదువే చదువుకొన్నారు......ఉండండి...నేనువెళ్లి చిన్నమ్మగారితో చెప్తాను...మీకెందుకీ రసాభాసంతా? వ్యవహారమంతా మూడు నిముషాల్లో రైటై పోతుంది'

'నువ్వేం చెప్తావ్? చిన్నమ్మగారేం చేస్తుంది?'

'విషయాలన్నీ విపులంగా చెప్తాను. ఆమె మాట శాసనమే కాదూ?...మనలో మన మాట, అసలు మీకు ఉద్యోగం ఎలా వచ్చిందో చెప్పురూ?'

'నీయిష్టం. అవుతే త్వరగా వెళ్లిరా'

౨

'చిన్నమ్మగారేం చేస్తున్నారు?'

'స్నానం చేస్తున్నారమ్మా!'

'క్షేమంగా వుంటోందో వారి దేహంలో; ఆ మధ్యనేదో జలుబు చేసిందను కొన్నారులే!'

'నెమ్మదిగానే వుంటున్నారు. తమరంటే చిన్నమ్మగారికి ఎంతో అభిమానం'

'ఏం?'

'నిన్న మధ్యాహ్నమే అన్నారు, పంకజమ్మగార్ని పిలిపించమని, తమర్ని పిల్చేందుకు మధ్యాహ్నం వద్దామనుకుంటున్నా. తమరే వచ్చేసారు'

'అలాగా!'

'నే వెళ్తానమ్మా. లోపల కుర్చీలో కూకోండి; బయలెందుకమ్మా!'

పంకజం కుర్చీలో కూచుని ఆలోచిస్తోంది.

'కష్టాలు ప్రతీ మానవుడికీ సర్వ సాధారణమంటారు...వట్టి బోల్లికబురు......ధనవంతుడికి ఏం కష్టంవుందీ?...ఈ జమీందారే వున్నాడు. అతనికి కష్టమంటే ఏమిటో తెలుసూ? తన ఎస్టేటులో మలమలమాడే ప్రజ ఎంతవుందో అంచనా వెయ్యడానికైనా తీరిక వుందా?

**Best and Genuine Musk, Saffron, Asafoetida.**
మొదటితరమైన అసలు కస్తూరి, కుంకుమపువ్వు, యింగువ.

*Musk* Rs. 25 to Rs. 28 per Tola, *Kashmir Saffron* Rs. 65 to Rs. 75 per 'lb.' *Asafoetida* Rs. 3 to Rs. 3-4 per 'lb.' *Sunheat Refined Shilajit* Rs. 30 per 'lb.' **Tonic Pills**:— A compound of *Musk, Pearls, Amber, Shilajit,* etc., a best remedy for organic and seminal weakness, 40 pills Rs. 4. Packing and Postage Extra, money refunded if unapproved. *Complete Price List and a Fancy Calendar Free.* Please make correspondence in English & mention this advertisement. **MEGHRAJ GUPTA & CO.** (*Regd.*), **Ludhiana** (*Punjab*)

'ఊఁ...అదేమిటి!...అసలు ప్రపంచకమే భాగ్యవంతులకి......పదిమందిలో పేరు రావాలంటే భాగ్యవంతుల యింట్లో పుట్టాలి; లేకపోతే, భాగ్యవంతుల చెలిమి అయినా చెయ్యాలి.........అసలైన మానవవికాసానికి Transitory period లో వున్న ఈ నాగరికతా ప్రపంచం తావియ్యడంలేదు.

'విధాత ఈ మానవ ప్రపంచాన్ని సృష్టించడంలో భాగ్యవంతుడికే ఆధిక్య మిచ్చాడు. మానసిక సంతోషాలన్నీ అనుభవించగల వ్యక్తి అతనొక్కడే! ఏ వ్యక్తి అయినా జీవిత మాధుర్యాన్ని సంపూర్ణంగా ఆశ్వాసించడానికి ధనికుడై వుండాలి...'

ఏమిటో అలా ఊహిస్తోంది ఆ యువ్వని.

ఎదురుగుండా అధికారి అగుపిస్తాడు.

లేచి నిలబడుతుంది.

అతడామె యువక అవయవ ఖిలసత్వాన్ని రెప్ప వాల్చకుండా వీక్షిస్తూంటాడు.

ఆచీరె...కంపెనీ చీరె...అహమ్మదాబాద్ మిల్ చీరె......ఆమె సంపూర్ణ దేహాన్ని అతని నేత్రద్వయానికి ఆహుతి కాకుండా కాపాడుతోంది. ఆ జాకెట్టు...తెల్లటిది...పల్చనిది...'ఈ సంసారకాంత టెన్నిస్ బంతుల్లాంటి తన కుచద్వయాన్ని బాడీస్‌తో బిగదీసి కట్టింద'ని బట్ట బయలు చేస్తోంది. నుదుటని వున్న లేత కుంకుమబొట్టు ఆమె పాతివ్రత్యాన్ని బయ్టలు పరచేటట్టు వో నూత్న ప్రతిభనిగాని తెస్తోందా మిసమిసలాడే మొహానికి. పాంబేబుపట్టాలు ఆమె పాదాలపై తమ అధికారాన్ని చలాయించలేక దండెత్తి వచ్చిన బర్మీస్ పాండల్స్‌కి దాసోహం అన్నాయి. మెళ్లోవున్న వంటిపేట బంగారపు గొలుసు ఆమె భర్తదైన్య స్థితినీ, ఆమెకి నగలయందుండే విముఖత్వాన్నీ తెలియ బరుస్తోంది.

అతడో గ్లాన్స్ పారేసాడు.

అంతఃపురాలకీ నీతి నియమాలకీ ఆమడ దూరం.

ఆమె తబ్బిబ్బవదు. కళ్ల నీళ్లు గిర్రున తిరగవు ఏడవదు. సహాయమని బొబ్బలు పెట్టదు. లాంప్‌పోస్ట్ లా నిలబడిపోతుంది.

## 3

'పుణ్యమవనీ, పాపమవనీ...ఏం, తప్పా?... నా స్థితిలోవున్న ఏ స్త్రీ సాహసించదు ఈ మాత్రపు పనికి!...అవును, కథకులు యిలాంటి సందర్భాల్లో మానవప్రకృతికి వ్యతిరేకంగా వుండే పాతివ్రత్యాన్ని ప్రదర్శిస్తూంటారు. అందుకే కథకి కాళ్లుంటాయని అంటారు...ఎదుట వో పురుషుడు...వో శుంఠ...కాదు, కాదు...శుంఠాగ్రేసర చక్రవర్తి...మూఢుడు...ధనమదాంధుడు...వట్టి వెధవ.

"పోనిద్దూ, ఎంతసేపు...అది నా అదృష్టమూ, నోముల పంటాగాని ప్రతిస్త్రీకీ యిలాంటి ఛాన్సు వస్తుందీ!!...ఒకగంటలో యిద్దరి జీవితాలకి దారిద్రమనేది తీరిపోతుంది...మిగిలిన జీవితమంతా ఆనందదాయకమే కాదూ?...ఈ కాస్త పాపం పోయేందుకు ఎన్ని సంతర్పణాలు చెయ్యాలో ఎవరైనా శాస్తుర్లగారిని అడుగుతాను...

'నీచత్వమని శ్లాఘిస్తారా ఆయన...ఆఁ... ఎందుకలా అంటారు? ఒకవేళ [illegible], ఆ మాత్రం కన్విన్స్ చెయ్యలేనూ?...ఇందులో

ఏం నీచత్వం వుందీ?...నిజంగా యిది వ్యభిచారమా? బ్లాక్ హెడ్స్ అనాలి దీన్ని వ్యభిచారమని. ప్రపంచకాన్ని కళ్ళద్దాల్తో చూసే ఫూల్స్ అంటారు దిన్ని వ్యభిచారమని..... ఉహుం ఇది వ్యభిచారం ఎప్పటికీకాదు...ఒక స్టుపిడ్ వున్నాడు. ఆస్టుపిడ్ లోవున్న లోపాన్ని Advantage గా తీసుకొని నా జీవితాన్ని ముఖ్యంగా నా భర్త జీవితాన్ని సుఖప్రదంగా వుండేటట్లు చేస్తున్నా.



'అబ్బ! ..వెధవభయం ..ఇంకా భయం ఎందుకూ? .కానున్నది జరక్క మానదు ..అన్నట్లు, సావిత్రి ..పురాణకాంత...ఆదర్శ స్త్రీ .. ఆమె తనభర్త ప్రాణాలకోసం, తన హృదయాన్ని యముడికి ధారపొయ్యలేదూ!! ..అలాగే, ఈ పంకజం, తన భర్త నిత్యానంద సౌఖ్యం కోసం, తనభౌతిక దేహాన్ని వో స్టుపిడ్ కి వో అరగంట అరువిస్తోంది...ఎవరెలా అనుకుంటే నాకేం. నామట్టుకు నాకు రైటుగానే తోస్తోంది'

'నువ్వు ముకుందరావు పెళ్ళానివా?'

'అవునండి'

'అబ్బ!.. ఎంత ఆనందాన్ని యిచ్చావ్!'

ఆమె తలవంచుకుంటుంది, చెరిగిపోయినకురుల్ని సవరించుకుంటూ:

'మళ్ళీ ఎప్పుడు?'

'తమదయ'

పంకజం జమీందారు తనచేతిలో పెట్టిన యిరవై వేల రూపాయల చెక్కునీ, వేలికి పెట్టిన వజ్రపు టుంగరాన్నీ చూసుకు సంతోషిస్తూ యింటికి మరల్తుంది.

ముకుందరావుకి ఆమెని చూసీ చూడగానే అనుమానం కల్గుతుంది. ఆపైన, విషయం గ్రహించుకుంటాడు. ఆమెని కులంలోంచి వెలివేయించడు. పదిమందితోనూ తనపెళ్లాం తన అధికారిదగ్గర పడుకుందని చెప్పుకోడు. ఆమెని నిందించడు; తిట్టడు; కొట్టడు; మోసగించడు; అన్నంపెట్టనని యింట్లోంచి వెళ్లగొట్టడు. అతనికి పిచ్చెత్తదు; ఆఖరుకి కలికుమారుడైనా అవడు. వ్యక్తిత్వాన్నీ, మానవత్వాన్నీ గుర్తించిన మానవుడిలా వూరుకుంటాడు.

ఆమే అంటుంది. రేపే వెళ్లిపోదామండీ ఈ ఊరునుంచి...నీచ......'

'నీయిష్టం, పంకజం' అని ఆమెని తన అక్కున జేర్చుకొని, కరువుదీరా నిజకాంతని ముద్దెట్టుకుంటూండగా, ఆమె సంతోష పరిరంభయై, కళ్లు ఆ ఆనందదాయకమైన అవస్తలో మూసుకొని, అతనిగ్రాపుని నిమురుతూ, 'కోపమా?' అని అంటుంది.

అతనేమీ నోటితో చెప్పలేక, కళ్లతోనే మాట్లాడుతూ, అదేపనిగా ముద్దెట్టుకుంటూంటాడు.

గుణము లేకపోయిన అయిదు రూపాయలు వాపసు చేయబడును

# గర్భ సంజీవి తైలము



స్త్రీలకు బహిష్టు కాలమున వచ్చు ముట్టు కుట్టును ఈ మందు తక్షణమే పోగొట్టును. మాసాంతమునకు సరిగ బహిష్టులు కాని స్త్రీలకు సాధారణముగా వచ్చు రోగములన్నిటిని, అనగా దగ్గు, అంటుకుట్టు, జ్వరము, వాయువు, అసంపూర్ణ రక్త స్రావము, తలదిమ్ము, తలనొప్పి, ఒళ్లు నొప్పి, కీళ్లు నొప్పులు, దేహము ఊదుట, కడుపు పెరుగుట, లేవలేనట్టి బద్ధకము, తల తిరుగుడు, మూర్ఛ, ఆకలి లేకుండుట, భోజన మన్న అసహ్యము, ఒక చెంబు నీటినికూడ ఎత్తలేని బలహీనము, సన్నిపాతము మొదలగు వ్యాధులం వన్నిటిని ఈ తైలము పోగొట్టి, గర్భమును శుభ్రపరచి, సంతానమును కలిగించును. ఆరు విధములయిన గొడ్రాలితనమును పారద్రోలును. గర్భోత్పత్తికి అడ్డమువచ్చు క్రిమిజాలమును చంపివేయును. దృఢ గాత్రులను, పూర్ణాయువులును అగు సంతానమును కల్గించును.

ఒక స్త్రీకి మూడు అవున్సు మందు ఉపయోగింపవలెను

ఒక అవున్సు ధర రూ. 2-0-0 3 అవున్సులు రూ 5-0-0 తపాలా ఖర్చులు వేరు.

పళని వైద్య ఆసిరియర్

## ఆర్. ఎమ్. కె. వేలుస్వామి పిళ్లై

సిద్ధ వైద్యశాల, 146, పురశవాకం హైరోడ్డు, మద్రాసు

ముఖ్య కార్యాలయము: (హెడ్ ఆఫీసు) పళని